ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక

Bullet Edition

ఆదివారం, 21 జూలై 2024 www.prajaaswaramdaily.com 2PM


## సీఎం రేవంత్ పట్టు వస్త్రాల సమర్పణ

ప్రతిష్టాత్మక లష్కర్ బోనాల జాతర ఆదివారం అట్టహాసంగా ప్రారంభమైంది. అమ్మ వారికి మంత్రి పొన్నం ప్రభాకర్ తొలి బోనం సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి అమ్మవారికి దర్శించుకుని ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.. అదేవిధంగా మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా దేవతను దర్శించుకోనున్నారు.



# బోనమెత్తిన లష్కర్

అట్టహాసంగా ఉజ్జయినీ మహంకాళి బోనాల జాతర

అమ్మవారి దర్శనం కోసం పోటెత్తిన భక్తులు

సికింద్రాబాద్, జూలై 21 (ప్రజాస్వరం) : లష్కర్ బోనాల జాతర ఆదివారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా భక్తుల కొంగు బంగారం సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయాన్ని రంగురంగుల పూలు, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఈ మేరకు పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల నృత్యాలు, తొట్టెలు, ఫలహార బండ్ల ఊరేగింపులతో అమ్మ వారికి మంత్రి పొన్నం ప్రభాకర్ తొలి బోనం సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. అమ్మవారిని సీఎం రేవంత్, మంత్రులు, ఎమ్మెల్యేలు దర్శించుకున్నారు. వారి దర్శనం కోసం పోలీసులు ప్రత్యేక లైన్లను ఏర్పాటు చేశారు. అదేవిధంగా శివసత్తులకు కూడా మరో క్యూ లైన్‌ను సిద్ధం చేశారు. ఇక సోమవారం రంగం భవిష్యవాణి, అమ్మవారి ఊరేగింపుతో జాతరకు ముగింపు పలుకనున్నారు. ఉదయం తెల్లవారుజాము నుంచే భక్తులు అమ్మవారి దర్శించుకునేందుక క్యూలో నిల్చున్నారు. 1,500 మంది సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసినట్లుగా డీజీపీ తెలిపారు. జాతరకు భక్తుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని వివిధ ప్రాంతాల నుంచి టీజీఎస్ ఆర్టీసీ 175 ప్రత్యేక బస్సులను నడుపనుంది.



అమ్మవారి సన్నిధిలో కిషన్‌రెడ్డి దంపతులు

బోనాల సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దంపతులు సికింద్రాబాద్ ఉజ్జయిని మహాకాళి అమ్మవారిని దర్శించుకొని బోనం సమర్పించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. మన రాష్ట్రంలో కొన్ని వందల సంవత్సరాల నుంచి బోనాల పండగ సంప్రదాయం ఉందని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఈ వేడుక మనకు మాత్రమే ప్రత్యేకమన్నారు. దేశంలోని అన్నివర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు చెప్పారు. అలాగే, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. మంత్రి పొన్నం ప్రభాకర్, సీఎం రేవంత్ రెడ్డి, బీజేపీ ఎంపీ లక్ష్మణ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, మాజీ మంత్రి మల్లారెడ్డి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.



## కిడ్నాప్ కథ సుఖాంతం



నిజామాబాద్, జూలై 21 (ప్రజాస్వరం) : నిజామాబాద్ జిల్లా కిడ్నాప్ కథ సుఖాంతం అయింది. నిజామాబాద్ జనరల్ ఆస్పత్రిలో కిడ్నాప్ కు గురైన మూడేళ్ల బాలుడు అరుణ్ ఆచూకిని పోలీసులు కనుగొన్నారు. జగిత్యాల జిల్లా మెట్ పల్లిలో కిడ్నాపర్లను పోలీసులు పట్టుకున్నారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు కేసును చేధించారు. పోలీసులు బాలుడిని అప్పగించడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. మానిక్ బండార్ కు చెందిన ఛాయా ప్రసవం కోసం నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో శుక్రవారం చేరారు. డాక్టర్లు మరుసటి రోజు డెలివరీ చేస్తామని చెప్పడంతో.. సాయినాథ్ తన మూడేళ్ల కొడుకు అరుణ్ తో కలిసి ప్రసూతి విభాగం ఎదురుగా ఉన్న వరండాలో పడుకున్నాడు. శనివారం తెల్లవారుజామున 3:30 గంటల సమయంలో లేచి చూడగా.. పక్కన నిద్రిస్తున్న కొడుకు కనిపించలేదు. ఎక్కడ వెతికినా అరుణ్ కనిపించలేదు. ఆసుపత్రి భద్రత సిబ్బందికి ఫిర్యాదు చేయగా.. వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. ఆరు బృందాలుగా విడిపోయి గాలించారు. ఆసుపత్రి సీసీఫుటేజీలు పరిశీలించగా ఇద్దరు యువకులు వచ్చి సాయినాథ్ పక్కన నిద్రిస్తున్నట్లు నటించి.. అరుణ్ ను ఎత్తుకెళ్లినట్టు గుర్తించారు. వ్యక్తుల దుస్తుల ఆధారంగా ఎటు వెళ్లారో కనుక్కున్నారు. దుండగులు ఆర్మూర్ పట్టణం మీదుగా కరీంనగర్ వైపు వెళ్తున్నట్లు గమనించారు. ఈ క్రమంలో మెట్ పల్లిలో నిందితులను గుర్తించి.. అదుపులోకి తీసున్నారు. అపహరణకు గురైన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. తన చెల్లికి పిల్లలు లేరని, ఆ లోటు తీర్చేందుకు అరుణ్ ను కిడ్నాప్ చేసినట్టు కిడ్నాపర్ తెలిపాడు.


## బోయిన్‌పల్లిలో దారుణం

### భార్య, కుమార్తెను చంపి.. ఆత్మహత్య భర్త

సికింద్రాబాద్, జూలై 21 (ప్రజాస్వరం) : సికింద్రాబాద్ బోయిన్‌పల్లిలో దారుణం చోటుచేసుకుంది. ఓ వ్యక్తి అనుమానంతో కట్టుకున్న భార్య, నెలల బిడ్డను చంపి, ఆత్మహత్య చేసుకున్నాడు. మహారాష్ట్ర నాంథేడ్‌కు చెందిన గణేశ్, స్వప్న దంపతులు బోయిన్‌పల్లిలోని ఆర్యసమాజ్ వద్ద వీరు నివాముంటున్నారు. వీరికి ముగ్గురు పిల్లలు. గణేశ్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మూడో కూతురు నక్షత్ర తనకు పుట్టలేదనే అనుమానంతో తరచుగా భార్యతో గొడవ పడేవాడు. అనుమానంతో ఆదివారం తెల్లవారుజామున భార్య, కుమార్తెను గొంతు నులిమి చంపేసిన గణేశ్.. రైలు పట్టాలపై పడుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పక్కింట్లో ఉండే సువర్ణ మాట్లాడుతూ 'ఉదయం నాలుగు గంటల ప్రాంతంలో గణేశ్ బయటికి వెళ్తూ కనబడ్డాడు. గణేశ్ వాళ్ల అమ్మ, అన్నకు ఫోన్ చేసి మాట్లాడమని చెప్పాడు. స్వప్న వాళ్ళ కుటుంబ సభ్యులకు యాక్సిడెంట్ అయిందని, ఆమెకి ఇప్పుడే చెప్పొద్దని నాతో చెప్పాడు. స్వప్న వాళ్ళ అమ్మది ఫోన్ నెంబర్ ఇంట్లో ఉందని, ఫోన్ చేయమని చెప్పి వెళ్లిపోయాడు. లోపలికి వెళ్లి చూస్తే దారుణం జరిగింది' అని తెలిపారు.

## లోయలో పడిన కారు

నిర్మల్, జూలై 21 (ప్రజాస్వరం) : రోడ్డుపై దట్టమైన పొగ మంచుతో రోడ్డు కనిపించక అదుపుతప్పి కారు లోయలో పడిన ఘటన నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలో జరిగింది. హైదరాబాద్‌కు చెందిన రాధాకృష్ణ కుటుంబ సభ్యులతో నాగపూర్‌కు వెళ్తున్నాడు. అయితే మహాబూబ్ ఘాట్ సెక్షన్ వద్దకు వచ్చేసరికి పొగ మంచుతో రోడ్డు కనిపించక అదుపుతప్పి లోయలో పడింది. సమాచారం అందుకున్న పోలీసులు వారిని కాపాడి ఆసుపత్రికి తరలించారు.



# ముసురు..

## మరో నాలుగు రోజులు..

హైదరాబాద్, జూలై 21 (ప్రజాస్వరం) : రాష్ట్రంలో ఇప్పటికే ఎడతెరపి లేని వర్షం కురుస్తున్న తరుణంలో మరో నాలుగు రోజుల పాటు జల్లులు కురిసే అవకాశాలున్నట్లు వాతావరణశాఖ ప్రకటించింది. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 30 సర్కిళ్ల పరిధిలో డీఆర్ఎఫ్ బృందాలు విధి నిర్వహణలో నిమగ్నమయ్యాయి. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని జీహెచ్ఎంసీ అధికారులు సూచించారు. ప్రజలకు ఏదైనా ఇబ్బందులు ఎదురైతే జీహెచ్ఎంసీ కాల్ సెంటర్ 040-21111111, లేదా విపత్తుల నివారణ కోసం డిజాస్టర్ రెస్క్యూ ఫోర్స్ సహాయం కొరకు 90001 13667 లను సంప్రదించాలని కమిషనర్ కోరారు.



ఆరెంజ్ అలర్ట్

హైదరాబాద్, వికారాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, రంగారెడ్డి, సంగారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం, హన్మకొండ, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, కొమరం భీమ్ ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, ములుగు, వరంగల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శఖ ఆరెంజ్ అలర్ట్‌ను జారీ చేసింది.



మేడ్చల్‌లో గురుపౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న హరివర్ధన్‌రెడ్డి

## ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

మేడ్చల్, జూలై 21 (ప్రజాస్వరం) : రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరుపుకుంటున్నారు. సాయిబాబా ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది. మేడ్చల్ పట్టణంలోని సాయిబాబా ఆలయానికి తెల్లవారుజాము నుంచే భక్తులు తరలివచ్చారు. మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డి బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు, ఆలయ నిర్వాహకులు ఆయనను ఘనంగా సన్మానించారు.



## మాజీ ఎమ్మెల్యే రాజయ్య కారు ఢీకొని మహిళ మృతి

వరంగల్, జూలై 21 (ప్రజాస్వరం) : స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య ప్రయాణిస్తున్న కారు ఢీకొట్టడంతో ఓ మహిళ మృత్యువాత పడింది. ఈ ఘటన కాజీపేట మండలం మడికొండలో శనివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మడికొండ ఎస్సీ కాలనీకి చెందిన కలకోట స్వప్న(40) అదే ప్రాంతంలో శనివారం రాత్రి డివైడర్ మధ్య నుంచి రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ వైపు నుంచి వస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య కారు ఆమెను ఢీకొట్టింది. దీంతో ఎగిరిపడిన స్వప్న అక్కడికక్కడే మరణించింది. ప్రమాద సమయంలో రాజయ్య కారులోనే ఉన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే కారు దిగిన రాజయ్య.. బాధిత మహిళను చూశారని, పోలీసు స్టేషన్‌కు వచ్చి మాట్లాడతా.. దయచేసి నన్ను ఇబ్బంది పెట్టవద్దు' అని పోలీసులతో అన్నారని సమాచారం. ప్రమాదానికి కారణమైన కారును కాజీపేట బాపూజీనగర్‌లో వదిలిసి రాజయ్య వెళ్లిపోయారు. మృతురాలు స్వప్నకు భర్త, కుమారుడు ఉన్నారు. ప్రమాదంపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



## ఢిల్లీకి బయలుదేరిన సీఎం రేవంత్‌రెడ్డి

సికింద్రాబాద్, జూలై 21 (ప్రజాస్వరం) : లష్కర్ బోనాల సందర్భంగా ఉదయం ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న సీఎం రేవంత్‌రెడ్డి నేరుగా ఆదివారం ఢిల్లీకి బయలుదేరారు. రైతు రుణమాఫీ అమలు చేసిన నేపథ్యంలో వరంగల్‌లో కృతజ్ఞత సభ నిర్వహించాలనే సర్కార్ యోచిస్తోంది.సభకు ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీని ఆహ్వానించేందుకు రేవంత్ ఢిల్లీకి వెళ్లినట్లుగా తెలుస్తోంది.

## కేదార్‌నాథ్ యాత్రలో అపశృతి



కేదార్ నాథ్, జూలై 21 (ప్రజాస్వరం) : కేదార్ నాథ్ యాత్రలో ఆదివారం అపశృతి చోటుచేసుకుంది. భారీ వర్షాలకు ఉత్తరాఖండ్ లో పలుచోట్ల కొండచరియలు విరిగిపడుతున్నాయి. ఆదివారం యాత్ర మార్గంలో కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో ముగ్గురు యాత్రీకులు అక్కడికక్కడే చనిపోయారు. మరో ఎనిమిది మంది యాత్రీకులు గాయపడ్డారు. గౌరీకుండ్, ఛిర్ బాసా మధ్యలో ఈ ప్రమాదం జరిగిందని అధికారులు వెల్లడించారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. కాగా, చనిపోయిన యాత్రీకులలో ఇద్దరు మహారాష్ట్రకు చెందిన వారని, మరొకరి వివరాలు తెలియాల్సి ఉందని చెప్పారు. ఈ ఘటనపై ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామీ విచారం వ్యక్తంచేశారు. గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించే ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.